క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలో 11కేవీ పాతబస్టాండ్ ఫీడర్ మరమ్మతు దృష్ట్యా ఆదివారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ మహ్మద్ రఫీ తెలిపారు. హజిఖాన్‌పేట, ఎస్పీ, ఆర్డీవో కార్యాలయం, రవితేజ స్కూల్, పాతబస్టాండ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బ్యాగులు పంపిణీ

మక్తల్: మండలంలోని అనుగొండ స్కూల్ హెచ్‌ఎం వెంకటేశ్, కర్ని స్కూల్ టీచర్ తిరుమల శనివారం చిట్యాల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేశారు. తమ కుమారుడు గౌతమ్‌తేజ జన్మదినం సందర్భంగా బ్యాగులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విభీషన పాల్గొన్నారు.

భాషా పండితులకు పేపర్-3 నిర్వహించాలి

నారాయణపేటటౌన్ : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో భాషా పండితులకు పేపర్-3 నిర్వహించాలని భాషా పండిత అభ్యర్థులు నర్సింహ, సురేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో భాషా పండితులకు టెట్‌లో సాంఘికశాస్త్రం లేదా గణితం, సైన్స్‌కు సంబంధించిన 60 మార్కులు, భాషా పండితులకు సంబంధించి సబ్జెక్టుకు 30 మార్కులు కేటాయించడంతో చాలామంది అర్హత కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. భాషా పండితులకు పేపర్-3 నిర్వహించకపోవడంతో 30వేల మంది అభ్యర్థులకు అన్యాయం జరిగిందన్నారు. రాబోయే టెట్‌లో పండితులకు పేపర్- 3 నిర్వహించి న్యాయం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో హోమం

మక్తల్: మండలంలోని వల్లభాపురం శ్రీదత్త క్షేత్రంలో శనివారం గీతాజ్ఞాన యజ్ఞం పూర్ణాహుతి హోమాన్ని భక్తిశ్రద్ధలతో చేశారు. హోమంలో 30 జంటలు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వనజాదత్తు, చిట్యాల సర్పంచ్‌జానకీలక్ష్మణ్ దంపతులుపాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే



నారాయణపేట: హైదరాబాద్‌లో శనివారం వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావును స్థానిక ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి కలిశారు. నారాయణపేట జిల్లాకు మెడికల్ కళాశాలను మంజూరు చేసినందుకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

కేటీఆర్ వ్యాఖ్యలు సరికాదు

నారాయణపేట టౌన్ : వరంగల్ జిల్లాలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటనను బహిష్కరిస్తామని మున్సిపల్, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ చెప్పడం రాజకీయ అవివేకమని కేంద్ర సహాయ న్యాయవాది, బీజేపీ సీనియర్ నాయకుడు రఘువీర్‌యాదవ్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రానికి ప్రధానమంత్రి వస్తే ముఖ్యమంత్రి, మంత్రులు స్వాగతం పలకడం బాధ్యత అని గుర్తు చేశారు. కానీ సీఎం కేసీఆర్ ప్రధాని వచ్చిన ప్రతిసారి పారిపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రధానమంత్రి పర్యటనను బహిష్కరిస్తామంటూ కేటీఆర్ మాట్లాడడం సరికాదన్నారు.

కంపెనీ అనుమతులను రద్దు చేయాలి

మరికల్: ఇథనాల్ కంపెనీ అనుమతులను రద్దు చేయాలని కేవీపీఎస్ జాతీయ నాయకుడు లక్ష్మయ్య అన్నారు. కంపెనీ ఏర్పాటు చేయొద్దని శని వారం చేపట్టిన దీక్షను ప్రారంభించారు. ఇథనాల్ కంపెనీతో భవిష్యత్ తరాలకు కాలుష్య ముప్పు తప్పదన్నారు. విషయంపై ఇక్కడి పాలకులు స్పందించకుండా కంపెనీ యాజమాన్యానికి అమ్ముడుపోవడం హేయమైన చర్య అని అన్నారు. కంపెనీ పునాదులు కదిలించే వరకు పోరాటం చేస్తామన్నారు. జూరాల నుంచి కోయిల్‌సాగర్‌కు వచ్చే నీళ్ల కంపెనీకి పోకుండా అడ్డుకొని తీరుతామన్నారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం

ధన్వాడ: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన దశరథం గత కొద్దిరోజులుగా సోరియసిస్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆర్థిక పరిస్థితి లేక అద్దెకు ఆటోను నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పదోతరగతి స్నేహితులు తలకొద్ది డబ్బులు వేసుకోని కిరాయికి నడుపుతున్న ఆటోయజమానితో మాట్లాడి అదే ఆటోను స్నేహితుడికి కొనుగోళు చేసి అందజేశారు. దీంతో స్నేహితులు చేసిన సాయం మరువలేనిదని సంతోషం వ్యక్తం చేశాడు. స్నేహితులు రాజశేఖర్, అబ్దుల్‌ఖాదర్, రమేష్, గోవర్ధన్, లక్ష్మికాంత్‌రెడ్డి, నర్సోజి, ఖదీర్, ఉసేన్, బాల్‌రాజు, శేఖర్, రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

నిలువెత్తు నిర్లక్ష్యం

- ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలను అల్లుకుపోతున్న పిచ్చిమొక్కలు
- విద్యుత్ సరఫరాలో అంతరాయం
- పట్టించుకోని అధికారులు

నారాయణపేట టౌన్ : తీగజాతి మొక్కలతో అల్లుకుపోయిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు సంబంధిత అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయి. వానాకాలంలో స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పిచ్చిమొక్కలు లేకుండా చూడాల్సిన అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో పాటు ఎప్పుడే ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. జిల్లా కేంద్రంలోని శ్రీనగర్‌కాలనీ, శ్యాసన్‌పల్లి రోడ్డు, శాతవాహన కాలనీ, ఎస్సీ కాలనీ, సివిల్‌లైన్, సత్యసాయికాలనీ, బాహర్‌పేట వేంకటేశ్వరస్వామి ఆలయం, పళ్లలోని పొల్కమ్మ ఆలయం, బీసీకాలనీల్లో పలు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు పిచ్చిమొక్కలతో కనిపించని స్థితి నెలకొన్నది. కరెంట్ స్తంభాలకు కేవలం చెట్లకొమ్మలు అడ్డొస్తే తొలగింపు పనులు చేపట్టే అధికారులు.. పిచ్చిమొక్కలను తొలగించడంలో విఫలమవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



జిల్లా కేంద్రంలోని శాతవాహన కాలనీలో విద్యుత్ స్తంభం వద్ద ఏపుగా పెరిగిన తీగజాతి మొక్క



ఎస్సీ కాలనీ ప్రధాన కాలువ వద్ద..



టీచర్స్ కాలనీ, శ్యాసన్‌పల్లి రోడ్డులో..



ఆర్డీవో కార్యాలయం పక్కన..

అందరి సహకారంతో అభివృద్ధి

మక్తల్: అందరి సహకారంతో మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని మినీ ట్యాంక్‌బండ్ వద్ద వెల్‌కం మక్తల్ నేమ్ బోర్డు పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెల్‌కం బోర్డు నిర్మాణానికి దాదాపు రూ.20లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పట్టణ ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకుగానూ అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఏఈ నాగశివ, బీఆర్‌ఎస్ నాయకులు మహిపాల్‌రెడ్డి, కావలి శ్రీహరి, శేఖర్‌రెడ్డి, గాలిరెడ్డి, లక్ష్మణ్, అశోక్‌గౌడ్ ఉన్నారు.



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం

మహ్మద్‌సలీంకు అభినందన

రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన మహ్మద్‌సలీంను ఎమ్మెల్యే చిట్టెం అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు సలీం పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్, మహిపాల్‌రెడ్డి ఉన్నారు.

విద్యుత్‌రంగంలో దేశానికే ఆదర్శం

మాగనూర్: విద్యుత్ రంగంలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే చిట్టెం అన్నారు. మండలంలోని నేరడగంలో రూ. కోటి 50లక్షలతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయానికి నిరంతరం విద్యుత్ అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. విద్యుత్ లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి నియోజకవర్గంలో 21కిపైగా సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అశోక్‌గౌడ్, నేరడగం పశ్చిమాద్రి సంస్థాన విరక్తమఠం పంచమసిద్ధ లింగ మహాస్వాములు, జెడ్పీటీసీ వెంకటయ్య, సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, విద్యుత్ డీఈ సంజీవరెడ్డి, ఏడీ నర్సింహారావు, ఏఈ దేవేంద్రనాయుడు, ఏడీఈ సివిల్ జితేందర్‌నాథ్, ఏఈ నిరంజన్‌దాస్, యాకూబ్‌ఆలీ, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

ఊట్కూరు: మండలంలోని కొత్తపల్లిలో శనివారం వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే చిట్టెం గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో రాము, అంజప్ప, వెంకటప్ప, రాజు ఉన్నారు.

ఘనంగా వైఎస్‌ఆర్ జయంతి

మక్తల్: మహనేత వైఎస్సార్ జయంతి వేడుకలను శనివారం మక్తల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ప్రజాసంక్షేమానికి వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బి.నర్సింహులు, మండల అధ్యక్షుడు గణేశ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు రవికుమార్, మీడియా ఇంచార్జీ నరేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు నూరుద్దీన్, ఫయాజ్, గోవర్ధన్, రాజేందర్, నారాయణ, సురేశ్, నాగేందర్, శ్రీనివాసులు, వెంకటేశ్, రవికుమార్, దామోదర్‌రెడ్డి, హన్మంతు, సుదర్శన్‌గౌడ్, సూర్యకుమార్, కృష్ణ పాల్గొన్నారు.



పాతర్‌చేడ్‌లోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నర్వ: దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని మండలంలోని పలు గ్రామాల్లో ఆయన అభిమానులు, వైఎస్సార్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పాతర్‌చేడ్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యువజన విభాగం నాయకుడు అశ్లెం నాగరాజురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతు పూర్తి



రైల్వే బ్రిడ్జిపై వేసిన బీటీరోడ్డు

మరికల్: మండలకేంద్రం నుంచి పల్లెగడ్డ, తీలేర్, వెంకటాపూర్, కన్మనూర్ వెళ్లే రోడ్ల మరమ్మతు పనులు పూర్తయ్యాయి. భారీ వాహనాల రాకపోకలతో ఆయా గ్రామాల రోడ్లు అధ్వానంగా మారాయి. గ్రామస్తుల ఆందోళనతో స్పందించిన అధికారులు ఎట్టకేలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేశారు. రైల్వే బ్రిడ్జిపై కూడా బీటీ వేయడంపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న సమ్మె

పంచాయతీ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె శనివారం కొనసాగింది. కార్మికుల సమ్మెకు పలు సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. గ్రామీణ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచడంతోపాటు మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను విరమించేదిలేదని పంచాయతీ కార్మికులు స్పష్టం చేశారు.



ఊట్కూరులో సమ్మెలో పాల్గొన్న పంచాయతీ కార్మికులు

– సాక్షి నెట్‌వర్క్

గుర్తుతెలియని మహిళ శవం లభ్యం

మక్తల్: మక్తల్ పట్టణ సమీపంలో ఉన్న కాటన్‌మిల్ దగ్గర కుడి కాల్వకు కిలోమీటర్ దూరంలో ఓ మహిళ శవం శనివారం రాత్రి 8గంటలకు లభ్యమైంది. మక్తల్ పట్టణ సమీపంలో పొలాల్లో పని చేస్తున్న రైతులకు కంపచెట్ల దగ్గర మహిళ శవం కనిపించడంతో మక్తల్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే సీఐ రాంలాల్, మక్తల్ ఎస్‌ఐ పర్వతాలు అక్కడికి చేరుకున్నారు. శవం గుర్తుపట్టలేని స్థితిలో ఉండటంతో మున్సిపల్ కార్మికులను పిలిపించి వాహనంలో శవాన్ని మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శవం దగ్గర తాళంచెవి, మద్యంసీసా, ప్లాస్టిక్ కాగితాలు ఉన్నాయి. ఆమె వయస్సు 25నుంచి 30 సంవత్సరాలు ఉండవచ్చని పోలీసులు తెలిపారు. ఎర్రని జాకెట్, ఆకుపచ్చని చీర, కాళ్ల కడియాలు ధరించి ఉందని, ముఖం గుర్తు పట్టలేని స్థితిలో ఉందని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు మక్తల్ సీఐ నంబర్ 8712670411, 8712670386కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని మక్తల్ ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మాగనూర్: మండలంలోని నల్లగట్టు మారెమ్మవ్వ బఆబూలయ సమీపంలోని శనివారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. గుడేబాల్లూర్ గ్రామానికి చెందిన రాము అనే యువకుడు సొంత పనుల నిమిత్తం మాగనూర్‌కు వచ్చి తిరిగి కృష్ణ వైపు వెళ్తుండగా స్పీడ్‌బ్రేకర్ ఉండటంతో అదుపుతప్పి కింద పడటంతో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు యువకుడిని మాగనూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే కృష్ణ రహదారిలో ఉన్న ఆ స్పీడ్ బ్రేకర్ ఎత్తుగా ఉందని అధికారులు స్పందించి దాని సైజ్ తగ్గించడంతో పాటు గుర్తులు ఏర్పాటుచేయాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

సారా పట్టివేత

దామరగిద్ద: సారా తయారు చేసి విక్రయిస్తుండగా పోలీసులు శనివారం దాడులు నిర్వహించి పట్టుకున్నారు. ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు కథనం ప్రకారం.. మండలంలోని వత్తుగుండ్లతండాలో గోపాల్‌నాయక్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. 4 లీటర్ల సారా, 15 కేజీల బెల్లం, 3 కేజీల పటిక బెల్లం పట్టుకున్నారు. గోపాల్‌నాయక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అటవీశాఖ అధికారులకు జింకపిల్ల అప్పగింత



ఊట్కూరు: మండల కేంద్రం శివారులో మూకి బసవన్న దేవాలయ సమీపంలోని పొలంలో జింక పిల్లపై కుక్కలు దాడి చేశాయి. సమీప పొలంలో పనిచేస్తున్న మోహన్‌రెడ్డి కుక్కల అరుపులు విని అక్కడికి వెళ్లి జింక పిల్లను కాపాడారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఎస్‌ఐ రమేష్ ఆధ్వర్యంలో అటవీ శాఖ అధికారులకు అప్పగించారు.

60వ రోజుకు చేరిన రిలే దీక్ష

నారాయణపేట రూరల్ : కోటకొండను మండలకేంద్రం చేయాలని చేపట్టిన రిలే నిరాహారదీక్ష శని వారం 60వ రోజుకు చేరింది. దీక్షాశిబిరంలో బీజేపీ నాయకులు కూర్చోగా, సాధన సమితి సభ్యులు పూలమాల వేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా నాయకుడు శ్రీనివాసులు మాట్లాడుతూ అన్ని అర్హతలు ఉన్న కోటకొండను మండలకేంద్రం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీ అనసూయ, రాము, దస్తప్ప, యాద గిరి, కాశీనాథ్, రాములు, చెన్నప్ప, సలీం తది తరు లు పాల్గొన్నారు.

కేజీబీవీ టీచర్ల సమస్యలను పరిష్కరించాలి

నారాయణపేట రూరల్ : కేజీబీవీ ఉపాధ్యాయినుల సమస్యలను పరిష్కరించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కేజీబీవీని తపస్ బృందం సందర్శించి టీచర్ల సమస్యలను తెలుసుకున్నారు. మహిళా టీచర్లు తమ కుటుంబాన్ని సైతం పక్కనపెట్టి ఎక్కువ సమయం విద్యార్థినుల కోసం కేటాయిస్తున్నారని, వారికి కనీస వేతన స్కేలును అమలు చేయాలని డిమాండ్ చేశా రు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలోనే తక్కు వ వేతనం ఇస్తున్నట్లు తెలిపారు. ఆకస్మిక సెలవులు పెంచాలని, అదనపు పనికి వేతనం అందించాలన్నారు. ఔట్‌సోర్సింగ్ పద్ధతి నుంచి విముక్తి కల్పించి రెగ్యులర్ చేయాలన్నారు. పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నర్సింహ, విశ్వనాథ్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకట్రాములు, కేజీబీవీ టీచర్లు పావని, భారతి, ప్రశాంతి, పారిజాత, వీణ, సునీత, పుష్పలత పాల్గొన్నారు.



కేజీబీవీలో సమస్యలను తెలుసుకుంటున్న తపస్ నాయకులు

ఎమ్మెల్యేను విమర్శించే అర్హత లేదు

మక్తల్: ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని విమర్శించే అర్హత బీజేపీ నాయకులకు లేదని నారాయణపేట జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్ అన్నారు. శనివారం మక్తల్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఊట్కూర్ మండల సర్వసభ్య సమావేశంలో జింకల విషయంపై చర్చ సందర్భంగా ఎమ్మెల్యేపై లేనిపోని వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రైతుల కోసం పనిచేసే నాయకుడిపై లేనిపోని విమర్శలు చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్ల నుంచి లక్ష ఎకరాలకు సా గునీటిని అందిస్తున్న ఘనత చిట్టెం రామ్మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. నారాయణపేట రోడ్డు మరమ్మతు కోసం రూ.5కోట్లు మంజూరు చేస్తే ఇంకా టెండర్ ప్రక్రియల్లో ఉందని, ఆ కాంట్రాక్టర్ బీజేపీకి చెందిన వ్యక్తి అని తెలిపారు. మక్తల్‌కు డిగ్రీ కళాశాల, 150 పడకల ప్రభుత్వ ఆస్పత్రి మంజూరు చే యడం జరిగిందన్నారు. బీజేపీ నాయకులను ప్ర జలు నమ్మే స్థితిలో లేరన్నారు. మాగనూర్ పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, కౌన్సిలర్ మొగులప్ప, శంషొద్దీన్, మహిళా విభాగం అధ్యక్షు రాలు రాధిక, పట్టణఅధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, కా వలి శ్రీహరి, అన్వర్, మధు, చెన్నయ్యగౌడ్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి



యాదవుల యుద్ధభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

నారాయణపేట టౌన్ : సమస్యల పరిష్కారం కోసం యాదవులు సమిష్టిగా ఉద్యమించాలని యాదవుల విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం యాదవులకు రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో అవకాశాలు కల్పించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో అన్ని పార్టీలు యాదవులకు 22 ఎమ్మెల్యే, 7 ఎమ్మెల్సీ, 5 ఎంపీ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, రాష్ట్ర బడ్జెట్‌లో 18శాతం నిధులు కేటాయించాలన్నారు. అనంతరం యాదవుల యుద్ధభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు తిరుపతియాదవ్, రఘువీర్‌యాదవ్, బా లప్ప, గోపాల్, మల్లేష్, రాజు, వెంకటయ్యయాదవ్, బసప్ప, నాగులుయాదవ్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీ విజయం ఖాయం



ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

కోస్గి: రానున్న ఎన్నికల్లో బీజేపీ అఖండ విజయం సాధించి మరోమారు కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమని, రాష్ట్రంలో సైతం ప్రజలు ఆశీర్వదించి బీజేపీకి పట్టం కట్టాలని ఆ పార్టీ నాయకులు కోరారు. మహాసంపర్క్ అభియాన్‌లో భాగంగా శనివారం మండలంలోని హన్మాన్‌పల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశాభివృద్ధికి ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్రంలో బీజేపీ రోజురోజుకు బలోపేతమవుతుంటే జీర్ణించుకోలేని రాష్ట్ర ప్రభుత్వం బీజేపీపై తప్పుడు ప్రచారం చేస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోకన్వీనర్ కోటకొండ రాము, గ్రామాధ్యక్షుడు పాలెం రమేశ్, శక్తికేంద్ర ఇంచార్జీ మహేందర్, నాయకులు వెంకటేశ్, మహేశ్, విజయ్‌కుమార్, మహ్మద్, శ్రీకాంత్, రాజు పాల్గొన్నారు.

నారాయణపేట టౌన్ : ప్రధానమంత్రి నరేంద్రమోదీ వరంగల్ పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసిన బీజేపీ విజయసంకల్ప సభలో పార్టీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్, సీనియర్ నాయకులు నాగూరావు నామాజీ, కొత్తకాపు రతంగ్‌పాండురెడ్డి, జిల్లా అధ్యక్షుడు పగుడాకుల శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు రాఘురామయ్యగౌడ్ , మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహబూబ్‌అలీ పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని ముడుమాల్‌కు చెందిన బీజేపీ కార్యకర్తలు ఎవరూ బీఆర్‌ఎస్‌లోకి వెళ్లలేదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్, జాతీయ కార్యవర్గ సభ్యుడు అమర్‌కుమార్ దీక్షిత్, మండల అధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. శనివారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేవలం బాలరాజు మాత్రమే బీఆర్‌ఎస్‌లో చేరాడన్నారు. అతడు గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్‌ఎస్‌లోకి, బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలోకి మారాడని గుర్తు చేశారు. తమ పార్టీ కార్యకర్తలు పటిష్టంగా ఉన్నారని పేర్కొన్నారు. సమావేశంలో మజ్జిగ సురేశ్, రాఘవేంద్ర, నాగేందర్, కిష్టప్ప ఉన్నారు.

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా రవికుమార్

మక్తల్: కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా రవికుమార్‌ను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, వర్కింగ్ కమిటీ అధక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదేశాల మేరకు నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పట్టణ అధక్షుడిగా ఎన్నుకోవడంపై పార్టీ నాయకులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. అనంతరం జిల్లా అధక్షుడు వాకిటి శ్రీహరిని పూలమాల, శాలువాతో సన్మానించారు.

నర్వ ఎస్‌ఐగా కురుమయ్య

నర్వ: స్థానిక పోలీస్‌స్టేషన్ నూతన ఎస్‌ఐగా సీహెచ్ కురుమయ్య బాధ్యతలు స్వీకరించారు. మండల ఎస్‌ఐగా విధులు నిర్వర్తించిన విక్రమ్ బదిలీపై గద్వాల్‌కు వెళ్లడంతో ఆయన స్థానంలో జోగుళాంబ గద్వాల జిల్లాలోని రాజోళి నుంచి కురుమయ్య బదిలీపై వచ్చారు. శనివారం నారాయణపేట ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు.

పనులు ప్రారంభం

ధన్వాడ: మండలంలోని పాతపల్లి బీటీరోడ్డు పనులను శనివారం ప్రారంభించారు. ధన్వాడ నుంచి పాతపల్లి వరకు చేపట్టిన బీటీరోడ్డు రెన్యువల్ పనులను అధికారులు పరిశీలించారు. రోడ్డు పనులు చేపట్టడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.